క్లుప్తంగా

అమీనాబాద్‌లో గ్రామోత్సవం



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని దత్తపీఠం వార్షికోత్సవంలో భాగంగా రెండో రోజు సోమవారం విశేష పూజలు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వేద పండితులు గణపతి పూజ, మండపారాధన, పుణ్యాహవాచనం, చక్రస్నానం నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించిన వంద కలశాలకు పలు ప్రాంతాల నుంచి తెప్పించిన నదీజలాలతో నింపి పూజలు చేశారు. మూల మూర్తులకు అష్టోత్తర, సహస్ర నామాలతో సుదర్శన హవనం గావించారు. సాయంత్రం వేదికపై చిన్నారులచే భరతనాట్యం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను దత్తపీఠం నిర్వాహకులు జయశంకర్ పర్యవేక్షించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణ



తాడేపల్లిరూరల్ : 62 రోజులుగా ఏసీసీ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా.. ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించడం లేదని ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణ విమర్శించారు. సోమవారం బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఏసీసీ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని ఎన్నికల ముందు నారా లోకేష్ హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేష్ అమలు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూరపాటి స్టీవెన్, కరుణశ్రీ, టి.నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, సుభాని, ఇమాంబి, రమణ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అఖిలాండేశ్వరి అమ్మవారి దేవస్థానం వార్షికోత్సవం



మంగళగిరి (తాడేపల్లిరూరల్) : మంగళగిరి పట్టణంలో వేంచేసియున్న అఖిలాండేశ్వరి అమ్మవారి దేవస్థాన వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి చక్రపూజ, కుంకుమార్చన, సహస్ర నామార్చన, పంచహారతులు, మంత్రపుష్పం పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ 17వ వార్షికోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్తలు ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కాలారి సుబ్బారావు, వసంత దంపతులు, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్నెం రమేష్‌బాబు, భక్త బృందం ప్రతినిధులు వీరయ్య, తాడిశెట్టి శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండారు పల్లిలో సీసీ కెమెరాలు ఏర్పాటు



తాడికొండ: మండల పరిధిలోని బండారు పల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం తాడికొండ సీఐ కె.వాసు చేతుల మీదుగా సీసీ కెమెరాలు ప్రారంభించారు. గుంటుపల్లి పానయ్య, అడ్వకేట్ సాయి, మిత్ర బృందం సహకారంతో పది సీసీ కెమెరాలు గ్రామంలో నాలుగు ప్రధాన జంక్షన్‌లలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలన్నారు. ప్రస్తుతం రాజధాని ప్రాంతంగా రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో అపరిచిత వ్యక్తులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఎక్కువగా సంచరించే అవకాశం ఉన్న నేపథ్యంలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల చోరీలు, నేరాల నియంత్రణకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

వాసవీ మాత గుడి నిర్మాణానికి భూమి పూజ

చేబ్రోలు: చేబ్రోలులో సోమవారం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం జరిగింది. తాళ్లాయపాలెం పీఠాధిపతి శివస్వామి, మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, క్రేన్ సంస్థల అధినేత గ్రంధి వెంకట సత్య లక్ష్మీ కాంతారావు తదితరులు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్థానిక నిత్యానందాశ్రమ సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి, శారదా అమ్మవార్లు, ఆది శంకరాచార్యుల నూతన దేశాలయ శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా దేవత మూలమంత్ర, అస్త్ర మంత్ర హోమాలు, మహా పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, భక్తులు హాజరయ్యారు.

అంగన్‌వాడీల యాప్‌సోపాలు

- తరచూ మొరాయిస్తున్న సెల్‌ఫోన్లు
- సాంకేతిక సమస్యలతో సతమతం
- పిల్లల వివరాల నమోదుకు ఆటంకం
- వేతనాల్లో కోత అంటూ బెదిరింపులు



అంగన్ వాడీ కేంద్రం

తాడేపల్లిరూరల్ : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్న కార్యకర్తలను కష్టాలు వెంటాడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో అనేక అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోందని వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిలో భాగంగానే ప్రీ స్కూల్ పిల్లల వివరాలను ఎప్పటికప్పుడు 'పోషణ్ ట్రాకర్' యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. కానీ పలు సాంకేతిక సమస్యల కారణంగా సెల్ ఫోన్లు తరచూ మొరాయిస్తున్నాయి.

అంగన్‌వాడీలు రోజువారీ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం సరఫరా చేస్తున్న చిక్కీలు, కోడిగుడ్లు, బాలామృతం, పీచు పదార్థాలు కలిగిన కూరలు వండి ఆహారంలో తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా మాతా, శిశువులు ఆరోగ్యంగా ఉండి సుఖ ప్రసవాలు జరుగుతాయని ప్రభుత్వ లక్ష్యం.

సమస్యలతో సతమతం

3 నెలల నుంచి 6 సంవత్సరాల లోపు ప్రీ స్కూల్ పిల్లల వివరాలను ప్రతి రోజూ హాజరు వేయాల్సి ఉంది. దీనిలో భాగంగా పిల్లల ఫొటో తీసి పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఏ రోజుకారోజు చిన్నారుల గ్రూపు ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. సెంటర్‌కు వచ్చిన తరువాత ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల లోపు ఇది పూర్తి చేయాల్సి ఉంది. రెండు, మూడు, వారం రోజుల వ్యవధిలో మార్పులు, చేర్పులు చేస్తుండడం వలన సాంకేతిక సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన నాసిరకం ఫోన్లు సక్రమంగా పని చేయడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం ఇచ్చినవి కావడంతో చాలా మంది వాటిని పక్కన పెట్టి సొంతంగా కొనుగోలు చేసుకున్న ఫోన్లను వినియోగిస్తున్నారు. కొంతమంది తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లనే వాడుతున్నారు. స్టోరేజీ, రామ్ తక్కువగా ఉండడం వలన ఫోన్ హ్యాంగ్ అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులకు గురైతే కొత్త ఫోన్లను రీప్లేస్ చేయడం లేదని అంటున్నారు.

వేతనాల్లో కోత అంటూ బెదిరింపులు

సాంకేతిక సమస్యలతో అంగన్‌వాడీ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వాటిని సరిచేసేందుకు ప్రయత్నం చేయాల్సిన అధికారులు యాప్‌లో పిల్లల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయకపోతే వేతనాల్లో కోతలు విధిస్తామంటూ బెదిరింపులకు దిగడం శోచనీయం. ఇప్పటికే అంగన్‌వాడీ వర్కర్లకు అధికారుల నుంచి హెచ్చరికలు అందాయి. యాప్ లోపాల వలన వర్కర్లు కేంద్రంలో ఉన్నప్పటికీ లొకేషన్ స్థానికంగా చూపించకపోవడంతో వివరాలు యాప్‌లో నమోదు కావడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కుస్తీ పడుతున్నా చివరలో వివరాలు నమోదయ్యే పరిస్థితి ఏర్పడింది. గంటల తరబడి వీటి కోసం సమయాన్ని వెచ్చించాల్సి వస్తోంది. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు వివరిస్తున్నా పట్టించుకోవడం లేదని వర్కర్లు ఆరోపిస్తున్నారు.



పోషణ ట్రాకర్ యాప్

యాప్‌ల పనిభారాన్ని తగ్గించాలి



అంగన్‌వాడీ వ్యవస్థపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. అదనపు పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. దీనికి తోడు యాప్‌ల పని భారంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తక్షణమే సాంకేతిక సమస్యలను పరిష్కరించాలి. అధికారుల ఒత్తిళ్లను నిలిపివేయాలి. ఎవరైనా అంగన్‌వాడీ టీచర్లు అనారోగ్యం పాలైనా, ఇతర సమస్యల వల్ల ఇచ్చిన యాప్‌లో ప్రతిరోజు అప్‌లోడ్ చేయకపోతే అంగన్‌వాడీ కార్యకర్తలకు వేధింపులు ఎక్కువ అవుతున్నాయి. వెంటనే అధికారులు ఈ యాప్‌లపై ప్రభుత్వంతో చర్చించి పనిభారం తగ్గించాలి లేదా వారితో పాటు మరొకరికి అదనంగా ఉద్యోగం కల్పించాలి.

– దుర్గారావు, సీఐటీయూ నాయకులు

క్రైమ్ కార్నర్

ఫలించిన మంగళగిరి పట్టణ పోలీసుల వ్యూహం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి పట్టణ, రూరల్ పరిధిలో ఇటీవల కాలంలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. పట్టణ పోలీసులు వ్యూహాత్మకంగా ముఖ్య కూడళ్లతో పాటు పలు ప్రాంతాల్లోని నివాసాల్లో ఉన్న సీసీ కెమెరాలను ప్రతి రోజు గమనిస్తూ విధులు నిర్వహించారు. ఆ సమయంలో కాళీ మాత ఆలయం వద్ద ద్విచక్ర వాహనాన్ని చోరీ చేస్తూ ఓ వ్యక్తి పోలీసులకు సీసీ కెమెరాలో తారసపడ్డాడు. ఆ సీసీ కెమెరాల్లో రాత్రి సమయంలో కూడా గమనిస్తూ ఉండగా అతను పట్టుబడ్డట్టు విశ్వసనీయ సమాచారం. ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా మంగళగిరి పట్టణ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి గంగూరుకు చెందిన వ్యక్తిగా తెలుసుకుని అతడ్ని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేపట్టారు. ఇప్పటికే సుమారు 10 వాహనాల వరకు రికవరీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. పట్టుబడిన వ్యక్తి ద్వారా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలియవచ్చింది. ఈ రికవరీపై మంగళగిరి పట్టణ పోలీసులను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎవరు దొంగతనాలు చేస్తున్నారో గుర్తించి వేరువేరు చోట్ల ఉన్న వాహనాలను రికవరీ చేశామని, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వారిని త్వరలో అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు.



మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు రికవరీ చేసిన ద్విచక్ర వాహనాలు

గంజాయి కేసులో పాత నేరస్తుని అరెస్ట్

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై తాడేపల్లి పోలీసులు దృష్టి సారించారు. సోమవారం గంజాయి విక్రయాల్లో అరెస్ట్ కాకుండా ఉన్న ఓ వ్యక్తిని తాడేపల్లి పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. ఈ సందర్భంగా సీఐ కళ్యాణ్ రాజు మాట్లాడుతూ 7-9-2023న డోలాస్‌నగర్‌లో గంజాయి అమ్ముతున్నారని సమాచారం రావడంతో అప్పుడు ఉన్న సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి గంజాయి అమ్ముతున్న వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. ముగ్గురు యువకుల్ని అరెస్ట్ చేయగా, నాల్గవ ముద్దాయి అయిన ఎస్‌కే సైదులు అనే వ్యక్తి పరారయ్యాడు. అప్పటి నుంచి సైదులు పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నాడు. అతనిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఆదివారం రాత్రి సైదులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. ముద్దాయి సైదులును పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్ఐ ఖాజావలిని, ఇతర సిబ్బందిని సీఐ అభినందించారు.



చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



చిన్న అంజి (ఫైల్)

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌లో నివాసముండే కూరగాయల వ్యాపారి తీసుకున్న నగదుకు వడ్డీలు కట్టి, అసలు చెల్లించలేక అప్పు ఇచ్చిన వారి ఒత్తిడి కారణంగా పురుగుల మందు తాగి మంగళగిరిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనపై సీఐ కళ్యాణ్ రాజు మాట్లాడుతూ ఉండవల్లికి చెందిన చిన్న అంజిబాబు (35) గత నెల 29వ తేదీన పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. ఆ వీడియోలో తనకు అప్పు ఇచ్చిన వారు వేధించడం వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నానని, నా అప్పులకు నా కుటుంబ సభ్యులకు ఎటువంటి సంబంధం లేదని తెలుపుతూ నలుగురి పేర్లను తెలిపాడు. ఈ ఘటనపై బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండవల్లికి చెందిన ప్రసాద్, హరీష్, మణి, యర్రబాలెంకు చెందిన ప్రేమ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళ్యాణ్ తెలిపారు. అంజిబాబు మృతి చెందడంతో బంధువులు, స్నేహితులు భారీగా మంగళగిరి మార్చురీకి చేరుకుని జోహార్ అంజిబాబు అంటూ నినాదాలు చేస్తూ ఉండవల్లి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కేసుకు సంబంధించి ప్రసాదు, హరీష్, ప్రేమ్‌ను అరెస్ట్ చేసి, కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ కల్యాణ్ రాజ్ తెలిపారు. మణిని కూడా రెండు రోజుల్లో అరెస్ట్ చేసి, కోర్టుకు హాజరుపరుస్తామని చెప్పారు.

రెండు వాహనాలు ఢీకొని ట్రాఫిక్ జామ్

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లి సెంటర్ న్యూ బ్రిడ్జి సమీపంలో సీతానగరం నుంచి ఉండవల్లికి వచ్చే రహదారిలో సోమవారం వీఐటీకి యూనివర్సిటీ బస్సు టర్నింగ్ తిరుగుతూ ఓ కారును ఢీ కొట్టింది. వీఐటీ యూనివర్సిటీకి చెందిన బస్సు డ్రైవరు కారులో ప్రయాణిస్తున్న వారిపై దురుసుగా ప్రవర్తించి గొడవకు దిగడంతో అరగంట సేపు ప్రకాశం బ్యారేజ్ వైపు, ఉండవల్లి వైపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వచ్చి యూనివర్సిటీ బస్సును పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



సీతానగరం టర్నింగ్‌లో కారును ఢీకొట్టిన యూనివర్సిటీ బస్సు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాకుమాను: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెం వద్ద సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ కథనం ప్రకారం బాపట్ల జిల్లా అడుసుమల్లి గ్రామానికి చెందిన ఊట్ల నాగేశ్వరరావు(55) ద్విచక్రవాహనంపై గుంటూరు నుంచి స్వగ్రామం వెళ్లే క్రమంలో అబ్బినేనిగుంటపాలెం సమీపంలోని మహాదేవ్ కోల్డ్ స్టోరేజ్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. నాగేశ్వరరావుకు గాయాలు కావడంతో చుట్టుపక్కల వారు 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి గల వివరాలను సేకరిస్తున్నట్లు ఎస్ఐ మధు పవన్ తెలిపారు.

11న లక్ష్మీతిరుపతమ్మ ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న గోపయ్య సమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయ 23వ వార్షికోత్సవం 11న నిర్వహించనున్నట్లు దేవస్థాన పాలకవర్గ సభ్యులు సోమవారం తెలిపారు. ఉదయం ఆలయంలో మూలవరులకు అర్చకులు వి.పూర్ణనాగసాయిచారి ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాలు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం పుష్పార్చన, లక్ష్మీగణపతి హోమం, ఉత్సవమూర్తులకు అష్టోత్తర, సహస్ర నామాలతో కుంకుమార్చన పూజలు నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేస్తారని చెప్పారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సులో నుంచి జారిపడిన యువకుడు

ద్విచక్రవాహనంపై ఆసుపత్రికి తరలింపు



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి గుంటూరు చానల్ దాటిన తరువాత విజయవాడ నుంచి అమరావతివైపు వెళుతున్న ఆర్టీసీ బస్సులో నుంచి ఓ యువకుడు జారి కింద పడిపోయాడు. సేకరించిన వివరాల ప్రకారం 301 నెంబరు బస్సులో ప్రయాణిస్తున్న ఓ యువకుడు బస్సులో ఫుట్‌రెస్ట్ మీద నిలబడ్డాడు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ షడన్‌గా బ్రేక్ కొట్టడంతో ఆ యువకుడు కింద పడి దొర్లుకుంటూ పక్కనే ఉన్న ముళ్లపొదల్లో పడ్డాడు. స్థానికులు, ఆర్టీసీ సిబ్బంది ఆ యువకుడ్ని ద్విచక్ర వాహనంపై విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఆ యువకుడు తన వివరాలను చెప్పలేకపోతున్నాడు.

రెండు బైక్‌లు ఢీ.. ఒక వ్యక్తికి తీవ్రగాయాలు



మంగళగిరి (తాడేపల్లిరూరల్): రెండు బైక్‌లు ఢీ కొట్టుకున్న ఘటన మంగళగిరిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు మంగళగిరి నగర పరిధిలోని ఆత్మకూరు వీజే కళాశాల సమీపంలో సర్వీస్ రోడ్డులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. మంగళగిరి నుంచి విజయవాడ వైపుగా వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రుణ్ని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

చిరువ్యాపారిపై దాడి



తాడేపల్లిరూరల్: తాడేపల్లి బైపాస్‌రోడ్‌లో విజయవాడ గుంటూరు సర్వీస్ రోడ్‌లో చిరువ్యాపారిపై మద్యంబాబులు దాడి చేసిన ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం కుంచనపల్లిలో నివాసముండే మురకొండ విజయ్‌కుమార్ బైపాస్ సర్వీస్‌రోడ్‌లో షవర్మ బండి ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు షవర్మ బండి వద్ద మద్యం తాగుతున్నారు. ఇక్కడ మద్యం తాగవద్దని పదే పదే చెప్పడంతో మద్యంబాబులు విజయ్‌కుమార్‌పై దాడి చేశారు. కాలికి, తలకు గాయాలు కావడంతో బంధువులు 108లో చికిత్స నిమిత్తం విజయవాడ గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. దాడి చేసిన వారు మహానాడు ప్రాంత వాసులుగా తెలియవచ్చింది. ఈ ఘటనపై విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



విజ్ఞాన విహార్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పలుచోట్ల సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళగిరి మండలం నూతక్కిలో ఉన్న విజ్ఞాన విహార్ పాఠశాలలో గణపతిపూజ, సరస్వతి అష్టోత్తరపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులతో పాటు, పిల్లలు సామూహిక సరస్వతి పూజల్లో పాల్గొన్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయురాలు అరుణ మాతాజీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో...

మాత సరస్వతిదేవి జన్మదినోత్సవాన్ని మంగళగిరి మండల పరిధిలోని రామచంద్రాపురంలో సోమవారం మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సరస్వతి మాతకు పంచామృత, వివిధ ఫలాలు, పసుపు, కుంకుమ, గంధంతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నైవేద్యాలు సమర్పించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం చేశారు. వారికి పెన్నులు, పెన్సిళ్లు, పలకలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భీమిరెడ్డి అంజిరెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొని తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అటవీ భూములను కాపాడండి

హేతువాద సంఘం అధ్యక్షుడు నారా వెంకట సుబ్బయ్య



ఎమ్మెల్యే బొలిశెట్టికి వినతిపత్రం అందజేస్తున్న హేతువాద సంఘం అధ్యక్షుడు సుబ్బయ్య

తాడేపల్లిరూరల్: అతి పవిత్రమైన తిరుపతి జిల్లాలోని బీఎన్ కండ్రిక మండలం సర్వే నెం.295, అంజూర్ ప్రాజెక్టులో అటవీ భూమిని కాపాడాలని, ఆక్రమణలను తొలగించి జంతు సంపదను కాపాడాలని భారతీయ హేతువాద సంఘం అధ్యక్షుడు నారా వెంకట సుబ్బయ్య అన్నారు. సోమవారం మంగళగిరి పట్టణ పరిధిలోని బైపాస్‌రోడ్ వెంబడి ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కార్యాలయంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసరావుకు అటవీ భూములు రక్షించాలని కోరుతూ ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ సర్వే నెం.295లో కల్కి ట్రస్టు వారు దాదాపు 20 సంవత్సరాలుగా డీప్ అంజూర్ ఫారెస్ట్ భూమిని ఆక్రమించి అటవీ నిబంధనలకు విరుద్ధంగా పెద్ద పెద్ద కట్టడాలు నిర్మించి, విదేశీయులను రప్పిస్తూ యోగ, ధ్యానం, భజనలు పేరుతో మోసం చేస్తున్నారని, ఈ విషయమై కల్కి ట్రస్ట్ మీద చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే అటవీ భూమిని ఒక దొంగస్వామికి దారాదత్తం చేయాలని అధికారులు ఆశ్రమ నిర్వాహకులతో కుమ్మక్కయ్యారని భావిస్తున్నట్లు తెలిపారు. ఇంతకాలం కల్కి ట్రస్ట్‌కు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసరావు తిరుపతి డీఎఫ్ఓకు ఫోన్ చేసి సమస్యను వివరించగా, 15 రోజుల్లో స్వాధీనం చేసుకుంటామని డీఎఫ్ఓ తెలిపారని వెంకట సుబ్బయ్య చెప్పారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ శాంతి

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరికి పౌష్టికాహారంపై అవగాహన అవసరమని డాక్టర్ శాంతి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా సోమవారం ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 148 మందికి బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఐదుగురు గర్భిణులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి పౌష్టికాహారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్నారులకు ఆహారం పెట్టే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, చేతులు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఆకుకూరలు, కరివేపాకు, మునగాకు వంటివి ఆహారంలో తీసుకోవడం ద్వారా ఎన్నో లాభాలు ఉన్నాయని చెప్పారు. వాటిని పొడి చేసుకొని పదార్థాల్లో వినియోగించుకోవచ్చన్నారు. వీటిని గర్భిణులు, బాలింతలు తీసుకోవడం ద్వారా రక్తహీనత లేకుండా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు వెళ్లాలి



వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న అన్నపురెడ్డి కోటిరెడ్డి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా జీవితంలో ముందుకు వెళ్లాలని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ (విజయవాడ 316డీ) అన్నపురెడ్డి కోటిరెడ్డి అన్నారు. తాడేపల్లి మండల పరిధిలోని పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించాలంటే లక్ష్యాలను ఏర్పరచుకున్నప్పుడే అది సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి నూటికి నూరు మార్కులు లక్ష్యంగా పెట్టుకుని చదివినప్పుడే మంచి మార్కులు సాధించడానికి అవకాశముంటుందన్నారు. అనంతరం ప్రతి ఒక్క విద్యార్థి వద్దకు వెళ్లి వారి లక్ష్యాలను అడిగి తెలుసుకుని, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు దుర్గామల్లేశ్వరరావు, కోటేశ్వరరావు, కానుమాను జోజప్ప, పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.సత్యనారాయణ రాజు, సీహెచ్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



గుంటూరు రూరల్: గోరంట్ల అన్నపూర్ణనగర్‌లోని లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు నాలుగో రోజు కనులపండుగగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జరిగాయి. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ధ్వజారోహణ, తీర్థ ప్రసాద వితరణ, పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించినట్టు చెప్పారు. మధ్యాహ్నం మహాన్నదానం నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామంలోని సమీప గ్రామాలకు చెందిన 20వేల మందికిపైగా భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదం స్వీకరించారన్నారు. నాలుగు రోజులపాటు నిర్వహించిన ఉత్సవాలు సోమవారంతో ముగిశాయని వెల్లడించారు.